క్లుప్తంగా

నగరంలో ట్రాఫిక్ పోలీసుల విస్తృత తనిఖీలు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో గురువారం ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. డీఎస్పీలు కాటంరాజు, విజయ్ శేఖర్, సీఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్‌ను నియంత్రించి, ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 15 మందిని, వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా వెళుతున్న ఆరుగురిని, బాలురు 11 మందిని, డ్రైవింగ్ లైసెన్స్ లేని 9 మందిని గుర్తించినట్టు తెలిపారు. అందరూ విద్యార్థులేనని, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిపారు.

విద్యార్థులు ట్యాబుల్లోని పాఠ్యాంశాలు చదవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబుల్లో బైజూస్ లెర్నింగ్ యాప్‌లో పొందుపరిచిన పాఠ్యాంశాలను చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎమ్మార్సీలో హెచ్‌ఎంలు, సీఆర్పీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు ట్యాబుల్లోని పాఠ్యాంశాలను చదువుతున్నారా లేదా అని తరగతి ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పరిశీలించాలని సూచించారు. నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని, పనుల బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు జయచంద్ర, శివప్రసాద్, గుప్తా, సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ, ప్రకాష్‌రెడ్డి, శివకుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



తిరుపతి గాంధీ రోడ్డు: త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం జీఎస్ మాడ వీధిలో సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, వరప్రసాద్, సుబ్రమణ్యం యాదవ్, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, తొండంనాటి సుబ్రమణ్యం రెడ్డి, తిరుమల శెట్టి రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శ్రీకాళహస్తి క్రీడాకారులు



శ్రీకాళహస్తి: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పట్టణానికి చెందిన కేసీసీ అకాడమి క్రీడాకారులు ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా మచిలీపట్టణంలోని నేషనల్ కళాశాలలో ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు క్రికెట్ పోటీలు జరిగాయి. అండర్ 14 విభాగంలో కేసీసీ జట్టు మూడో స్థానంలో నిలవగా, అండర్ 17 విభాగంలో ప్రీక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. అండర్–14 విభాగంలో విఖ్యాత్, కేతన్, హిమచరణ్, మోనిష్, అండర్ 17 విభాగంలో మోనిష్, కార్తీక్, గణేష్, రోహిత్, జయశివ ఎంపికయ్యారు. ఎంపికైన వారిని నిర్వాహకులు అభినందించారు.

చెల్లేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



పనులను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ చెల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పానగల్‌లో ఉన్న ఈ ఆలయ అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో పురాణ చారిత్రక ప్రసిద్ధమైన ఈ ఆలయం మరుగున పడిన విషయాన్ని గుర్తించామన్నారు. అభివృద్ధి కోసం రూ.12లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రహరీ, అంతర్గతంగా గ్రానైట్ రాళ్లు పరచడం, తిరుపతి–శ్రీకాళహస్తి రోడ్డు నుంచి ఆలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

- రూ.14 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- మరో రూ.5 కోట్లతో పనులకు ప్రణాళికలు
- ఎమ్మెల్యే చెవిరెడ్డికి ప్రజలు అభినందనలు

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. సచివాలయాల వ్యవస్థ ద్వారా పంచాయతీలను ప్రగతిపథంలో నడిపించేలా కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టిని అందిస్తోంది. ఈ క్రమంలోనే మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీలు అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నాయి.

– తిరుపతి మంగళం





రణధీర్‌పురం పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, సప్తగిరినగర్ పంచాయతీ బాలకృష్ణాపురంలో వేసిన సీసీరోడ్డు

తిరుపతి అర్బన్ మండలంలోని పంచాయతీలంటే ఒకప్పుడు శివారు గ్రామాలుగానే చూసేవారు. తిరుపతి నగరానికి సమీపంలో ఉన్నా మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోని పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టిసారించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా తన నియోజకవర్గంలోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని భావించారు. తిరుపతి నగరానికి సమీపంలో ఉన్న సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం, తిరుమలనగర్, పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఎన్ఆర్‌జీఎఫ్, తుడా, పంచాయతీరాజ్, 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.14 కోట్లతో సీసీరోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టారు. శుద్ధినీరు సరఫరా చేసేందుకు ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీలోనూ నూతన సచివాలయ భవనాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, రచ్చబండలు నిర్మించారు. మరో రూ.5 కోట్లతో సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీల్లో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 3 వేల మంది పేదలకు సొంతింటి కళను నెరవేర్చారు.

ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నాం



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందిస్తున్న సహకారంతో సప్తగిరినగర్ పంచాయతీలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు చేశాం. ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నాం. మంగళం బీటీఆర్‌కాలనీలో సీసీరోడ్లు, మురుగుకాలువలు నిర్మించాం. ఆర్వో వాటర్‌ను అందిస్తున్నాం.

– అశోక్‌రెడ్డి, సప్తగిరినగర్ ఉపసర్పంచ్

ఎన్నడూ లేనంతగా అభివృద్ధి



ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎంపీపీ మోహిత్‌రెడ్డి సహకారంతో రణధీర్‌పురం పంచాయతీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాం. ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలు ఎమ్మెల్యేకి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు. మేము ప్రజల్లోకి వెళ్లినప్పుడు బ్రహ్మరథం పడుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మీనారాయణ, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు

ఆదర్శ పంచాయతీలే లక్ష్యం



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆదర్శ పంచాయతీలే లక్ష్యంగా పక్కా ప్రణాళికలను రూపొందించాం. సర్పంచులు, పాలకవర్గ సభ్యుల భాగస్వామ్యంతో నిధులను సమీకరించి అభివృద్ధికి బాటలు వేశాం. రూ.14 కోట్లతో సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీల్లో పనులు చేపట్టాం. మరింత అభివృద్ధికి కృషి చేస్తున్నాం. –చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే

100 శాతం ఈ- క్రాప్‌కు సహకరించండి

తిరుపతి అర్బన్: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ చేయించడానికి రైతులు వ్యవసాయశాఖ అధికారులకు సహకరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో)ప్రసాద్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 78,801 మంది రైతులకు సంబంధించి 2,06,807 ఎకరాలు ఈ క్రాప్ చేయించాల్సి ఉండగా ఇప్పటి వరకు 77,611 మంది 2,06,686 ఎకరాలు పూర్తిచేసినట్లు వెల్లడించారు. 121 ఎకరాలు పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. శనివారం లోపు 100 శాతం ఈ క్రాప్ పూర్తి చేయించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో కస్టం హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

10న బహిరంగ వేలం

చంద్రగిరి: స్థానిక పంచాయతీకి సంబంధించిన పలు దుకాణాలకు 10న వేలం పాటలు నిర్వహించనున్నట్టు సర్పంచ్ ముదికుప్పం రూప, ఈఓ మహేశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారపు సంత, ప్రైవేటు బస్టాండ్(ఆర్టీసీ బస్టాండ్ మినహా), జంతు వధశాల, మరుగుదొడ్లు, ఆర్‌ఓ వాటర్‌ప్లాంటు నిర్వహణకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు ముందుగా పంచాయతీ కార్యదర్శి పేరిట స్టేట్ బ్యాంక్‌లో నిర్ణయించిన మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



ద్వారబంధానికి పూజలు

తిరుపతి గంగమ్మ ఆలయ గర్భగుడి ద్వారబంధానికి గురువారం పూజలు చేశారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



మాస్టర్ ప్లాన్ రోడ్డు పనుల పరిశీలన

తిరుపతి నగరంలోని పీకే లేఅవుట్‌లో నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. పనులను గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

హైపటైటిస్ బీ, సీపై అవగాహన



హైపటైటిస్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్, ఫైజర్ సంస్థల సహకారంతో హైపటైటిస్ బీ, సీపై అవగాహన కల్పించారు. అలాగే పలువురికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.రవిబాబు మాట్లాడుతూ నేడు అధిక శాతం మంది యువత చెడు వ్యసనాలకు లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ధూమ, మద్యపానం వలన కలిగే అనర్థాలను వివరించారు. హైపటైటిస్ బీ అండ్ సీని ప్రాథమిక దశలో గుర్తిస్తే సమూలంగా నయం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ టి.నారాయణమ్మ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుబ్రమణ్యంనాయుడు, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అమరావతి, అర్చన పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధం





కాలిపోయిన కారు, ద్విచక్ర వాహనం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మెయిన్ రోడ్డులో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మస్తాన్ ఇంటి వద్ద కారు, ద్విచక్ర వాహనం నిలిపారు. కారులో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. వెంటనే మంటలు పెరిగి కారు, ద్విచక్ర వాహనం కాలిపోయాయి. సమాచారం అందుకున్న పీలేరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.7 లక్షలు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. సంఘటనా స్థలాన్ని భాకరాపేట సీఐ తులసీరాం పరిశీలించారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి కోరారు. ఆమె గురువారం పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పన్ను వసూలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. వార్డు సచివాలయాల వారీగా వసూళ్లపై ప్రతి రోజూ సమీక్షించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు గ్రూపులుగా ఏర్పడి బకాయిదారుల ఇళ్లకు వెళ్లాలన్నారు. మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఆస్తి, నీటి, యూడీఎస్ పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. కొంతమంది ఆస్తి పన్నులు మాత్రమే చెల్లించి నీటి చార్జీలు చెల్లించడం లేదన్నారు. మార్చి 31వ తేదీ లోపు అన్ని పన్నులను చెల్లించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ ఆఫీసర్లు కెఎస్.వర్మ, శేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఏర్పేడు: రావిళ్లవారికండ్రిగ పొలాల్లో బోరు, విద్యుత్ మోటారు ధ్వంసంపై ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. రావిళ్లవారికండ్రిగకు చెందిన అశోక్ తాను కొనుగోలు చేసిన పొలంలోని బోరు, విద్యుత్ మోటారుతో పంటలు సాగు చేస్తున్నాడు. వడమాలపేట మండలం టీసీ అగ్రహారానికి చెందిన దాము బోరు, మోటారు తనదంటూ ధ్వంసం చేశారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. దాము పొలానికి వెళ్లి బోరు, మోటారు ధ్వంసం చేసిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు దాముపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మా భూముల్లో సహజ వాయువు పైపులైన్ వేయొద్దు



అధికారికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, రైతులు

సత్యవేడు: తమ భూముల్లో సహజ వాయువు పైపులైన్ వేయొద్దని ఇరుగుళం రైతులు తెలిపారు. తమిళనాడులోని తిరువళ్లూరు నుంచి శ్రీసిటీకి సహజ వాయువు పైపులైన్ ఏర్పాటుపై గురువారం ఇరుగుళంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధీకృత అధికారి పి.భవాని రైతులు, ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ సహజవాయువు పైపులైను వేయడం కోసం రైతులు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్‌రెడ్డితోపాటు పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇరుగుళంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల సమీపంలో పైపులైన్, గ్యాస్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల 500 మంది పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. సమీపంలోని శ్రీసిటీ, ప్రభుత్వ స్థలాల్లో పైపులైన్ వేసి ఇరుగుళం ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సర్పంచ్ జీ.శేఖర్, ఎంపీటీసీ బాలసుందరం రెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి, మధుసూదన్ బాబు, బి.మునిచంద్రారెడ్డి, సునీల్, దయాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శంకర్ యాదవ్, శశిభూషన్ పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో అసెంబ్లీ స్పీకర్




తిరుమల ఆలయం వెలుపల అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పక్కన రాణీ గౌరీ లక్ష్మీబాయి

తిరుమల: ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, కేరళ రాష్ట్ర ట్రావెన్‌కోర్ సంస్థ రాణీ గౌరీ లక్ష్మీబాయి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా తిరుచానూరు చేరుకుని పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

వేసవిలో పశువులకు పొంచి ఉన్న ముప్పు

- వడదెబ్బతో పాల ఉత్పత్తి తగ్గిపోయే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం
- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వంశీ





చంద్రగిరి: వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలని నారావారిపల్లి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వంశీ (96662 48158) తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బ తగిలి పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు పశువులు మృత్యువాత పడతాయని పేర్కొన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చని తెలిపారు.

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయట ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథులు నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగ్గా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ కలిగిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వాన్ని కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట చొంగ కారుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 106 నుంచి 109 డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవిస్తుంది. చూడి పశువుల్లో గర్భస్రావం సంభవిస్తుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోతుంది. దూడలు అతిసారం బారిన పడి మృత్యువాత పడతాయి. వ్యాధి నిరోధక శక్తిని కలిగించే యాంటీబాడీస్, మాంసపు కృత్తులు దూడలను వడదెబ్బ నుంచి 50 శాతం మేర కాపాడతాయని పరిశోధనల్లో తేలింది.

చికిత్సా విధానం

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే నీడలోకి చేర్చాలి. వాటి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరడానికి పలుమార్లు చల్లని నీటితో కడగాలి. తడి గోనె సంచులు కప్పి నీరు చల్లాలి. చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి.

- వేడిని తగ్గించడానికి అనాల్జిన్ ఇంజక్షన్ చేయించాలి.
- వడదెబ్బ లక్షణాలు తగ్గించడానికి, పశువులను మగతలో ఉంచడానికి క్లోర్ ప్రొమాజిన్ వంటి ట్రాంక్విలైజర్స్ వాడాలి.
- రక్తంలో డెక్స్ట్రోజ్ సెలైన్ ఎక్కించడం వలన శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

నివారణ చర్యలు

- వేసవిలో ఎండలో పశువుల్ని మేతకు వదల కూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయటకు వదలాలి. తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- పశువులను రోజుకు మూడు, నాలుగుసార్లు చల్లని నీటితో కడగాలి. నాటుజాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిపై తరచుగా నీళ్లు చల్లుతుండాలి.
- వెలుతురు, గాలి బాగా ప్రసరించేలా ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించుకోవాలి.
- రేకుల కప్పు ఉన్న షెడ్లపై వరిగడ్డి కప్పి మధ్యాహ్నం వేళల్లో నీళ్లు చల్లాలి.
- వడగాలుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

ఘనంగా ఎస్‌కేఆర్‌ఎస్ పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆంగ్ల ఉన్నత పాఠశాల 35వ క్రీడా వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో టీటీడీ విద్యాశాఖాధికారి ఎం.భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అలాగే ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేంద్రబాబు, రిటైర్డ్ హెచ్‌ఎంలు బీఎస్ఆర్.శర్మ, కె.కృష్ణమూర్తి, రిటైర్డ్ సూపరింటెండెంట్ వి.సుధాకర్, వెస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఓబయ్య, టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షుడు చీర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 240 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీవీఎస్.చక్రవర్తి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి న్యూ బాలాజీకాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 240 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల అధినేత డీవీఎస్.చక్రవర్తి తెలిపారు. కళాశాలలో గురువారం ఆల్‌సెట్, ఆల్ట్రూయిస్ట్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇందులో 170 మంది ఆల్‌సెట్, 70 మంది ఆల్ట్రూయిస్ట్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు.